సాక్షి
జనగామ
మంగళవారం । 1 । అక్టోబర్ । 2024



సీబీసీ.. రాష్ట్రంలోనే అతిపెద్ద చర్చి

131 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర గల వరంగల్ క్రిస్టియన్ కాలనీలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి నేడు (మంగళవారం) ప్రారంభం కానుంది. - 8లో▸



టైరు పేలింది.. పల్టీ కొట్టింది

యశ్వంతాపూర్ శివారులో ప్రైవేట్ ట్రావెల్ బస్సు టైరు పేలి బోల్తా పడింది. బస్సులోని 15 మంది గాయపడ్డారు. - 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
35°/25°

వాతావరణం

ఉదయం పొడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. సాయంత్రం ఆకాశం అక్కడక్కడా మేఘావృతమై చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'ఏబీవీ'లో స్వచ్ఛ కార్యక్రమం



జనగామ: జిల్లా కేంద్రంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల నుంచి ర్యాలీగా ఎల్ఐసీ ఆఫీసు ఎదురుగా ఉన్న బాబు జగ్జీవన్‌రాం విగ్రహం వద్దకు చేరుకున్నారు. పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగం ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, అధ్యాపకుడు నరసింహులు పాల్గొన్నారు.

మార్క్సిజమే మార్గదర్శకం



రఘునాథపల్లి: సమస్యల నుంచి మానవాళి విముక్తికి మార్క్సిజమే సరైన మార్గదర్శకమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ.అబ్బాస్ అన్నారు. సోమవారం కుర్చపల్లిలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అధ్యక్షతన జరిగిన పార్టీ మహాసభలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పెట్టుబడీదారి సమాజంలో నిరుద్యోగం దారిద్ర్యం, ఆకలి చావులు పెరిగిపోతున్నాయని వాటిని అరికట్టడంలో పాలకవర్గాలు విఫలమయ్యాయని అన్నారు. మోయలేని భారాలు మోపుతూ ప్రజల కొనుగోలు శక్తిని దెబ్బతీస్తున్నాయని చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచడంలో శ్రద్ధ చూపుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. ప్రజలకు ఉపాధి కల్పనపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నూతన గ్రామశాఖ కార్యదర్శిగా మూడోసారి కాసాని పుల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభలో నాయకులు రాపర్తి రాజు, గంగాపురం మహేందర్, బూడిద గోపి, పొదల నాగరాజు, సుంచు విజేందర్, కొడపాక యాకయ్య, రమేష్, వెంకన్న, అయోధ్య, ఉప్పలయ్య, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి



జనగామ: న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని జనగామ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎనగందుల చంద్రరుషి కోరారు. ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం కోర్టు ప్రాంగణంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ న్యావాదుల రక్షణ చట్టం, టెన్యూర్ పీపీల నియామకాన్ని పాత పద్ధతిలో నిర్వహించాలని తీర్మానించినట్లు చెప్పారు. వీటి పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కోర్టు ఎదుట అడ్వకేట్లు నినాదాలు చేశారు. కార్యక్రమంలో బార్ ప్రతినిధులు, న్యాయవాదులు నక్క సిద్ధులు, లక్ష్మణస్వామి, మంచాల రవీందర్, సత్తెయ్య, ఎల్లారెడ్డి, శంకర్, రామకృష్ణ, శ్రీనివాస్, దాస్, దయాకర్‌రెడ్డి, అశోక్, స్వప్న, రేఖ, సంగీత, సౌమ్య, రాంరెడ్డి, మల్లేశం, పరుశరాములు, కిరణ్, బాలరాజు తదితరులు ఉన్నారు.


అంబులెన్స్‌ల ఆకస్మిక తనిఖీ



జనగామ: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పరిధిలోని 108 అంబులెన్స్‌ను జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నసీరుద్దీన్, జిల్లా మేనేజర్ శ్రీనివాస్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 108, 102 అంబులెన్స్‌ల రికార్డులు, వాటిలోని యంత్ర పరికరాలను పరిశీలించిన ఆయన రిమార్క్ లేకుండా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. ఫోన్ కాల్ వచ్చిన వెంటనే స్పందించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తూ దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తీసుకు వెళ్లాలన్నారు. ఈఎంటీ ప్రశాంత్, పైలట్ గోపీచంద్ ఉన్నారు.

ఏఈఓల సమ్మె నోటీసు

జనగామ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వే చేయలేమంటూ ఏఈఓలు సోమవారం జిల్లా వ్యవసాయాధికారి రామారావు నాయక్‌కు సమ్మె నోటీసు అందజేశారు. జిల్లాలో 62 క్లస్టర్లు ఉండగా.. 3.20 లక్షల ఎకరాల వరకు సాగు భూమి ఉందని, ప్రస్తుతం ఒక్కో ఏఈఓకు 6, 10, 15వేల ఎకరాల పరిధి ఉందని, డిజిటల్ సర్వే చేయాలంటే వెయ్యి ఎకరాలకు ఒక విలేజ్ అసిస్టెంట్ అవసరం అన్నారు. న్యాయమైన వినతిని స్వీకరించి పరిష్కరించే వరకు ప్రస్తుత పనులు చేస్తూనే.. డిజిటల్ పంటల సర్వే ముట్టుకోమన్నారు.



కఠోర తపస్సు.. పట్టు సడలని ఏకాగ్రత.. నిద్రలేని రాత్రులు.. పొద్దు తెలియని రోజులు.. ఎన్నో కష్టనష్టాలు.. మరెన్నో ఇబ్బందులు అన్నింటినీ దాటుకొని చివరి మెట్టుకు చేరుకున్నారు డీఎస్సీ అభ్యర్థులు. సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాలతో ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. నేడు(మంగళవారం) నిర్వహించనున్న సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఒక్కో పోస్టుకు ముగ్గురిని పిలిచారు. ఆ ముగ్గురిలో నెగ్గేదెవరో.. కొలువు కొట్టేదెవరో వేచి చూడాల్సిందే..

ముగ్గురిలో నెగ్గేదెవరో?

డీఎస్సీ ఫలితాల వెల్లడి.. ఒక్కో పోస్టుకు ముగ్గురికి పిలుపు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,519 టీచర్ పోస్టులు
- అత్యధికంగా మహబూబాబాద్‌లో 381
- అత్యల్పంగా హనుమకొండ జిల్లాలో 187
- నేటినుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

విద్యారణ్యపురి : సుదీర్ఘకాలంగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిరీక్షిస్తున్న అభ్యర్థుల కల సాకారం కానుంది. సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాలతో ఉమ్మడి వరంగల్ జిల్లా అభ్యర్థులు ఆనందంలో మునిగిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 11,062 పోస్టుల భర్తీకి ఈఏడాది మార్చి ఒకటిన డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి జూలై 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తంగా 2.45 లక్షల మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,519 టీచర్ పోస్టులకు వేలాది మంది పోటీపడ్డారు. ఈనెల 9న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎంపికైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు సమాచారం. డీఎస్సీ మెరిట్ కమ్ రోస్టర్ ప్రకారం ఎంపిక జాబితాలను మంగళవారం రాత్రి డీఈఓలకు విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి పంపనున్నారు. ఒక్కో పోస్టుకు ముగ్గురి చొప్పున మెరిట్ కమ్ రోస్టర్ ప్రకారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలుస్తున్నారు.

నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని డీఈఓలు నేటి నుంచి 5వ తేదీ వరకు డీఎస్సీ అభ్యర్థులకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నారు. హనుమకొండ జిల్లాలోని అభ్యర్థులకు డీఈఓ కార్యాలయం పక్కన సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగనుంది. ఒక్కో పోస్టుకు ముగ్గురు అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయనున్నారు. ఆయా జిల్లాల్లోని మెరిట్ జాబితాను సంబంధిత డీఈఓ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను గెజిటెడ్ సైన్ చేయించుకుని, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు రెండు తీసుకుని రావాల్సి ఉంటుంది. కాగా.. ఎంపికైన అభ్యర్థి సుముఖత లేకపోతే వేరే అభ్యర్థిని ఎంపిక చేసే వీలుంటుందని ఒక్కో పోస్టుకు ముగ్గురు అభ్యర్థులను పిలుస్తున్నారు.

■ మొత్తం పోస్టులు ■ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలుపు

జిల్లా	మొత్తం పోస్టులు	సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలుపు
హనుమకొండ	187	561
వరంగల్	301	903
జనగామ	221	663
భూపాలపల్లి	237	711
ములుగు	192	576
మహబూబాబాద్	381	1,143

జిల్లాల వారీగా పోస్టుల వివరాలు..

జనగామ జిల్లాలో ఎస్ఏ 50, ఎల్‌పీ 21, పీఈటీ 7, ఎస్జీటీ 118, ఎస్ఏ స్పెషల్ 5, ఎస్జీటీ స్పెషల్ 20 మొత్తం 221 పోస్టుల్లో ఎంపిక చేస్తారు.

హనుమకొండ జిల్లాలో ఎస్ఏ 73, ఎల్‌పీ 5, పీఈటీ 7, ఎస్జీటీలు 81, ఎస్ఏ స్పెషల్ 4, ఎస్జీటీ స్పెషల్ 17, మొత్తం 187 పోస్టులకు ఎంపిక చేస్తారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఎస్ఏ 41, ఎల్‌పీ 20, పీఈటీ 7, ఎస్జీటీ 152, ఎస్ఏ స్పెషల్ 4, ఎస్జీటీ స్పెషల్ 13, మొత్తం 237 పోస్టుల్లో ఎంపిక చేస్తారు.

మహబూబాబాద్ జిల్లాలో ఎస్ఏ 71, ఎల్‌పీ 19, పీఈటీ 2, ఎస్జీటీ 264, ఎస్ఏ స్పెషల్ 5, ఎస్జీటీ స్పెషల్ 20 మొత్తం 381 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ములుగు జిల్లాలో ఎస్ఏ 33, ఎల్‌పీ 16, పీఈటీ 1, ఎస్జీటీ 125, ఎస్ఏ స్పెషల్ 3, ఎస్జీటీ స్పెషల్ 14 మొత్తం 192 పోస్టుల్లో ఎంపిక చేస్తారు.

వరంగల్ జిల్లాలో ఎస్ఏ 66, ఎల్పీ 21, పీఈటీ 6, ఎస్జీటీ 182, ఎస్ఏ స్పెషల్ 5, ఎస్జీటీ స్పెషల్ 21 మొత్తం 301 పోస్టుల్లో అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

నిరాశ నుంచి విజయతీరాలకు..

- పీడీ, పీఈటీ ఉద్యోగ పోటీ పరీక్షలో నరేష్ ప్రతిభ



దేవరుప్పుల : విద్యతోపాటు క్రీడారంగంలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుదన్న ఆలోచనతో గతంలో ఉద్యోగం చేతికందేలోపు కోర్టు కేసులతో నిరాశకు గురైన నరేష్.. పట్టుదలతో ఈసారి సర్కారు కొలువుల ఫలితాల్లో అగ్రభాగాన నిలిచాడు. మండల కేంద్రానికి చెందిన కారుపోతుల నరేష్ వ్యాయామ ఉపాధ్యాయ శిక్షణ పొందిన క్రమంలో చాలీచాలని వేతనంతో ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తూ ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నించాడు. ఈ తరుణంలోనే 2017 సంవత్సరం గురుకుల విద్యాలయాల్లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా నియామకమయ్యే క్రమంలో కొందరు వేసిన కోర్టు కేసుతో నిరాశకు గురయ్యాడు. ఈ క్రమంలోనే కుటుంబ పోషణ కోసం వాటర్ ప్లాంట్ నిర్వహణతో జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో ఫిజికల్ డైరెక్టర్‌తోపాటు పీఈటీ ఉద్యోగ పోటీ పరీక్ష విభాగాల ఫలితాల్లో జిల్లా స్థాయి మొదటి ర్యాంకులు సాధించాడు. అలాగే గతంలో కోర్టు కేసులో పెండింగ్‌లో ఉన్న గురుకుల విద్యాలయ వ్యాయామ ఉద్యోగానికి సైతం ఇటీవలే ఎంపికయ్యాడు.

ప్రెస్టెన్ పాఠశాలలో వెరిఫికేషన్



ఉపాధ్యాయ నియామక పరీక్ష ఎంపిక కోసం 1:3 నిష్పత్తి ప్రకారం ఈనెల ఒకటో తేదీ నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుంది. జిల్లా కేంద్రం ప్రెస్టెన్ పాఠశాలలో నిర్వహించే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు తమ మొబైల్‌కు వెరిఫికేషన్ మేసేజ్ వచ్చిన అభ్యర్థులు మాత్రమే రావాలి. సంబంధిత అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు జిరాక్స్ సెట్లు వెంట తెచ్చుకోవాలి. ఈనెల 3వ తేదీ వరకు నిర్వహించే వెరిఫికేషన్‌కు అవసరమైన అభ్యర్థుల వివరాలు, ఇతర అంశాలకు సంబంధించి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.

– కె.రాము, జిల్లా విద్యాధికారి

కొలువు కొట్టారు

మరింత మంది అభ్యర్థుల మనోగతం - 8లో▸

కొసరు ఎజెండాలేమిటి..?

- వార్డులపై చిన్నచూపు
- కుక్కలు దాడిచేస్తున్నా పట్టించుకోరా..
- అభివృద్ధి పనులను గాలికి వదిలేశారు
- అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం
- వాడీవేడిగా జనగామ మున్సిపల్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఫ్లోర్ లీడర్ హరిశ్చంద్రగుప్త, పాల్గొన్న సభ్యులు

జనగామ: మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించే ఎజెండా పంపించి.. తీర్మానించే సమయంలో టేబుల్ ఎజెండా పేరుతో కొసరు ఎజెండాలేమిటని సభ్యులు మండిపడ్డారు. పురపాలికలో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. 21వ వార్డు కౌన్సిలర్ కర్రె శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారులు సభ్యులకు సమాచారం ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, వార్డుల అభివృద్ధిపై చిన్నచూపు చూస్తున్నారని మండిపడ్డారు. పట్టణం స్వచ్ఛతగా ఉండేందుకు పని చేయాల్సిన కార్మికులతో కలెక్టరేట్‌లో పనులు చేయించడం ఏమిటని పలువురు సభ్యులు ప్రశ్నించారు.

ఎవరేమన్నారంటే..

కాంగ్రెస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గాదెపాక రాంచందర్ మాట్లాడుతూ పట్టణంలో కుక్కలతో ప్రజల ప్రాణాలకు ముప్పు ఉందని, దాడి చేస్తున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారని అన్నారు. నివారణకు చర్యలు తీసుకోవాలని కోరినా నిర్లక్ష్యంగా వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్కలను పట్టుకునేందుకు కేటాయించిన రూ.10లక్షల్లో ఇప్పటి వరకు ఎంత ఖర్చు చేశారో లెక్కలు చూపాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త మాట్లాడుతూ మిషన్ భగీరథ పైపులైన్ల కోసం సీసీ రహదారులను ఎడాపెడా తవ్వేసి అడ్డదిడ్డంగా ప్యాచ్ వర్క్‌లు చేయడం వల్ల రోడ్లన్నీ గుంతల మయంగామారి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. బతుకమ్మ, దసరా, దీపావళి పండుగల వేళ ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సులు, ఆర్టీసీ చౌరస్తా నుంచి రైల్వేస్టేషన్‌కు లోకల్ సర్వీసులు నడిపించాలని కోరారు. గతంలో మంజూరు చేసిన అభివృద్ధి పనులను గాలికి వదిలేశారని, వెంటనే వాటిని ప్రారంభించాలన్నారు. సభ్యురాలు పేర్ని స్వరూప మాట్లాడుతూ ఎజెండాలో ఇష్టం ఉన్న వారికే పనులు ఇస్తున్నారని, తమ వార్డులో అభివృద్ధి చేయాలని మొత్తుకుంటున్నా స్పందించడం లేదని వాపోయారు. మహిళా కౌన్సిలర్ గుర్రం భూలక్ష్మినాగరాజు మాట్లాడుతూ తమ వార్డులో రైల్వే అండర్‌పాస్ పనులు పూర్తి చేసి ప్రారంభించాలని కోరారు. శానిటేషన్ పనులు అధ్వానంగా మారాయన్నారు. సభ్యురాలు పగిడిపాటి సుధాసుగుణాకర్‌రాజు మాట్లాడుతూ 3వ వార్డులో పనిచేసే శానిటేషన్ కార్మికులను కలెక్టర్ కార్యాలయానికి పంపడం ఏమిటని ప్రశ్నించారు. మహిళా కౌన్సిలర్ ఉడుగుల శ్రీలత మాట్లాడుతూ తమ వార్డు పరిధిలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, మినీ ట్యాంక్ ఏర్పాటు చేయాలన్నారు. కౌన్సిలర్ గంగరబోయిన మల్లేష్ మాట్లాడుతూ జవాన్ల నియామకమై సెక్షన్‌కు సంబంధం లేకుండా అనుభవం లేని వారికి బాధ్యతలు అప్పగించడం సరికాదన్నారు. 24 ఎజెండా, 17 టేబుల్ అంశాలపై చర్చించి కౌన్సిల్ ఆమోదం తెలిపినట్లు కమిషనర్ వెంకటేశ్వర్లు తెలి పారు. మేనేజర్ రాములు, సెక్షన్ అధికారి మల్లిగారి మధు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పోలీసులపై నమ్మకాన్ని నిలబెట్టాలి

- వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న సీపీ

జనగామ: పోలీస్ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే సహించేది లేదు.. ప్రజలు పోలీసులపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టేలా పనిచేయాలని వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. జనగామ పోలీస్ డివిజనల్ కార్యాలయాన్ని(ఏసీపీ) ఆయన సోమవారం తనిఖీ చేశారు. వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, డివిజనల్ పోలీస్ అధికారులు సీపీకి మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం రికార్డులను పరిశీలించిన సీపీ.. పెండింగ్ కేసుల వివరాలు, నేరస్తుల అరెస్ట్, దర్యాప్తు స్థితిగతులను తెలుసుకున్నారు. అధికారుల పనితీరుపై సమీక్షించారు. ముఖ్యంగా డయల్ 100 నుంచి వచ్చే ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు తక్షణమే స్పందించి త్వరితగతిన బాధితులకు సహాయం అందించాలని చెప్పారు. అంతకు ముందు కార్యాలయం ఆవరణలో సీపీ మొక్కలు నాటారు. ఏసీపీ పార్థసారథి, సీఐ దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కావ్య

స్టేషన్‌ఘన్‌పూర్: మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఘన్‌పూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యాన సోమవారం స్థానిక ఓ ఫంక్షన్‌హాల్‌లో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పరిధి మండలాల నుంచి అంగన్‌వాడీ టీచర్లు బతుకమ్మలతో సమావేశానికి హాజరయ్యారు. సీడీపీఓ ఫ్లోరెన్స్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ మహిళా సాధికారత అంటే కేవలం ఆర్థికంగా బలపడటమే కాదని, ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు వృత్తిపరమైన, ఇంటి పనులతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, తద్వారా వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. సరైన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని, ఆరు నెలల వయస్సు వరకు తప్పకుండా తల్లిపాలు తాగించాలని చెప్పారు. అనంతరం సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఆర్డీఓ డీఎస్ వెంకన్న, ఏసీపీ భీమ్‌శర్మ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఘన్‌పూర్ పీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సంధ్య, వైద్యులు డాక్టర్ జనార్దన్, సంధ్య, ఎంపీడీఓ విజయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అంకితభావంతో పనిచేయాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: అధికారులు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్‌తో కలిసి జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టరేట్‌లోని అన్ని శాఖల వారీగా బయోమెట్రిక్ అటెండెన్స్ కోసం పూర్తి వివరాల నివేదిక సమర్పించాలన్నారు. అధికారులు ఫీల్డ్ లెవల్ సందర్శన తప్పనిసరి చేయాలని, పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆస్పత్రులను పర్యవేక్షించాలని చెప్పారు. ఫీల్డ్ విజిట్ నివేదిక ప్రతీ నెల 5వ తేదీ వరకు సీపీఓ ద్వారా సమర్పించాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టు కింద డిజిటల్ హెల్త్ కార్డుల సర్వే కోసం నియోజకవర్గాల వారీగా గ్రామాలు, వార్డులను ఎంపిక చేస్తామని, ఇందుకు నోడల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలు, మండల, గ్రామ ప్రత్యేక అధికారులను నియమిస్తామని చెప్పారు. అలాగే దసరా తరువాత ఖరీఫ్ ధాన్యం కొనుగోలు మొదలవుతున్నందున అన్ని చర్యలు చేపట్టాలని తెలిపారు. సమీక్షలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్న, జెడ్పీ సీఈఓ సరిత, డీఆర్డీఓ వసంత, సీపీఓ ఎల్.శ్రీనివాస్, డీఈఓ రాము, డీపీఓ స్వరూప, డీపీఓ రామారావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి

- డీఏఎంఓ శ్రీనివాస్



ఇప్పగూడెం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఏఎంఓ శ్రీనివాస్

స్టేషన్‌ఘన్‌పూర్: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలని జిల్లా విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తానేదార్‌పల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దసరా సెలవులు పూర్తయ్యేలోగా పనులు పూర్తిచేసి ఎంబీ రికార్డులు తయారు చేసుకుని అధికారులకు అందజేస్తే డబ్బులు త్వరగా అందుతాయన్నారు. అనంతరం ఇప్పగూడెం ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. న్యాస్ నమూనా పరీక్షలను పరిశీలించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఘన్‌పూర్ జెడ్పీఎస్ఎస్ హెచ్ఎం సంపత్, ఇప్పగూడెం పాఠశాలల హెచ్ఎంలు రఘుజీ, మల్లారెడ్డి, ఉపాధ్యాయులు అజయ్‌కుమార్, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా..!

- దరఖాస్తుదారుల ఆవేదన
- గ్రీవెన్స్‌లో 47 అర్జీల స్వీకరణ

జనగామ రూరల్: 'పాలొళ్లు అరెకురం భూమి ఆక్రమించారని ఒకరు.. పానాదిలో కంప పెట్టి పోనిత్తలేరని మరొకరు.. పట్టా కోసం పదేళ్ల నుంచి తిరుగుతున్నానని ఓ వృద్ధుడు.. డబుల్ బెడ్రూం మంజూరైనా ఇవ్వడం లేదని ఇంకొకరు' ఇలా పలు సమస్యలతో ప్రజలు సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు వచ్చారు. ఏళ్ల తరబడి తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావడంలేదని వాపోయారు. మొత్తం 47 అర్జీలు రాగా.. రెవెన్యూ భూసమస్యలపై 25, ఆర్డీఓ 8, ఎంప్లాయ్‌మెంట్, పోలీస్, ఇరిగేషన్ రెండు చొప్పున, మున్సిపల్ 3, ఇతర శాఖలకు ఒక్కొక్కటి ఉన్నాయి. కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేష్‌కుమార్, అధికారులు వినతులు స్వీకరించారు. అర్జీల్లో తమ పరిధిలో పరిష్కారమయ్యే వాటిని తక్షణం పరిశీలించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

పానాది నుంచి పోనిత్తలేరు..

జనగామ మండలం పెద్దరాంచర్లలో 255, 261, 330 సర్వే నంబర్లలో పానాది ఉంది. సుమారు వంద ఏళ్లనుంచి రైతులు వ్యవసాయ భూములు సాగు చేసుకుంటున్నారు. కొందరు రైతులు తమను పొలాలకు వెళ్లకుండా పానాది వద్ద కందకం తీసి అడ్డుకుంటున్నారు. పశువులను సైతం పోనివ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని గ్రామానికి చెందిన ఏళ్ల చంద్రారెడ్డి, బాల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, గాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



పక్క ఫొటోలోని వృద్ధుడి పేరు కిరీటిరెడ్డి ప్రకాష్‌రెడ్డి. దేవరుప్పుల మండలం రామచంద్రాపురంలోని 221బీ, 352సీ, 355వీ సర్వే నంబర్లలో ఈయనకు మొత్తం 3 ఎకరాల 8 గుంటల భూమి ఉంది. భూమిని సర్వే చేసి పట్టా పాస్‌బుక్‌లోకి నమోదు చేయాలని 10 ఏళ్ల నుంచి తిరుగుతున్నాడు. 'నా వయసు 90 ఏండ్లు.. కాళ్లు నడవరావడంలేదు. గతంలో తహసీల్దార్‌కు సమస్య చెప్పుకున్నా ప్రయోజనం లేదు. నా కొడుకు దివ్యాంగుడు.. పట్టా కోసం ఆటోలో ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నాం. సమస్య పరిష్కరించాలి' అని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నాడు.

భూమిపట్టా చేయడం లేదు



పోచన్నపేట శివారులో నా తండ్రి గ్యార అంజయ్య పేరు మీద ఒక ఎకరం భూమి ఉంది. ఏళ్ల తరబడి సాగులో ఉంటున్నం. పట్టా పాస్ బుక్ ఇవ్వాలని అధికారులకు దరఖాస్తు చేసుకుని తిరుగుతున్నా చేయడం లేదు. మా తండ్రి మరణించగా ఆయన పేరు మీద ఉన్న భూమి నా పేర చేయాలని పలుమార్లు ఆర్ఐని కలిసినా భూమి పట్టా చేయడం లేదు.

– గ్యార నరేష్, కొలనుపాక(బచ్చన్నపేట)

డబుల్ బెడ్రూం మంజూరైనా ఇవ్వలేదు..



15 ఏళ్ల క్రితం చెట్టు పైనుంచి కింద పడగా వెన్నముక విరిగి మంచానికే పరిమితమయ్యాను. నాకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. గ్రామంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటులో స్థలం పోగా 49 మందికి ఇళ్లు కట్టిస్తామని చెప్పారు. గతంలో డబుల్ బెడ్రూం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరు చేశారు. అధాకారులు పరిశీలించి ఇల్లు ఇవ్వడంలేదు. న్యాయం చేయాలి.

– గుండె బిక్షపతి, వడ్లకొండ(జనగామ)

అక్రమంగా పట్టా చేసుకున్నారు..



గ్రామంలోని 544.1ఎఫ్ సర్వే నంబర్‌లో ఒక ఎకరం 17 గుంటల భూమి మా మామ కొమురయ్య పేరున ఉంది. అనారోగ్యంతో నా భర్త బుచ్చయ్య చనిపోగా ఆయనకు రావాల్సి 30 గుంటల భూమి ఇవ్వకుండా పాలివారు అక్రమంగా పట్టా చేసుకున్నారు. దొంగ కాగితాలు సృష్టించి భూమి ఆక్రమించారు. అధికారుల చుట్టూ తిరిగినా ప్రయేజనం లేదు. భూమి ఇతరులకు విక్రయించకుండా చూడాలి.

– చెండేటి రామక్క, కుందారం(లింగాలఘణపురం)

విజయవిహారం..

- ఏకంగా నాలుగు ఉద్యోగాలకు ఎంపికైన రైతు బిడ్డ
- ఏఈఈ ఎంచుకున్న లక్ష్మారెడ్డి పల్లె వాసి రాజశేఖర్ రెడ్డి


రాజశేఖర్ రెడ్డి

గణపురం : కష్టపడితే సాధించలేనిది ఏదీ ఉండదనే నానుడికి ఆ యువకుడు సాధించిన విజయమే నిదర్శనం. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒక ప్రభుత్వం ఉద్యోగం సాధించడమే కష్టమైన తరుణంలో ఏకంగా నాలుగు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన కాంతాల రాజశేఖర్ రెడ్డి నాలుగు ఉద్యోగాలు సాధించాడు. అందులో తనకు ఇష్టమైన ఐబీ శాఖలో ఏఈఈగా సోమవారం విధుల్లో చేరారు. గణపురం మండలంలోని లక్ష్మారెడ్డిపల్లె గ్రామానికి చెందిన కాంతాల వనమాల, రాజిరెడ్డి దంపతుల కుమారుడు రాజశేఖర్ రెడ్డి చిన్నప్పటి నుంచే చదువులో టాపర్. ప్రాథమిక విద్య చెల్పూరు హైస్కూల్‌లో, ఇంటర్ హనుమకొండలో పూర్తి చేశారు. అనంతరం బీటెక్ విట్స్ కాలేజీలో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు.అనంతరం రైల్వే శాఖలో గ్రూప్–డిలో ఉద్యోగం సాధించి అందులో పని చేస్తూ ఉన్నత ఉద్యోగాల కోసం సన్నద్ధమయ్యాడు. పాలిటెక్నిక్ లెక్చరర్, గ్రూప్– 4, ఏఈఈ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ఇందులో ఐబీ శాఖలో ఏఈఈ పోస్టును ఎంచుకుని విధుల్లో చేరాడు.

మహిళలు సమాన హక్కుల కోసం పోరాడాలి


మాట్లాడుతున్న కేంద్ర కమిటీ సభ్యురాలు కుంభం సుకన్య

వరంగల్ చౌరస్తా : పాలకులు మహిళలకు సమాన హక్కులు కల్పించకుండా అణచి వేస్తున్నారని ఏఐఎఫ్‌డీడబ్ల్యూ కేంద్ర కమిటీ సభ్యురాలు కుంభం సుకన్య విమర్శించారు. సోమవారం వరంగల్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ఓంకార్ భవన్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఏఐఎఫ్‌డీడబ్ల్యూ) రాష్ట్ర ప్లీనరీ వస్కుల సైదమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సుకన్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళలు సంఘటితంగా ఐక్య పోరాటాల ద్వారా స్వేచ్ఛ, సమానత్వం సాధించాలని పిలుపునిచ్చారు. మహిళలను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా ముందుకు రానీయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ ప్లీనరీలో రాష్ట్ర అధ్యక్షురాలు అంగడి పుష్ప, ప్రధాన కార్యదర్శి రాగ సుధ, కోశాధికారి తాండ్ర కళావతి, తదితరులు పాల్గొన్నారు.



కొలువు కొట్టారు

ప్రస్తుత కాలంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే ఆషామాషీ కాదు. పోస్టులు పదుల్లో ఉంటే.. దరఖాస్తులు లక్షల్లో ఉంటున్నాయి. పోటీ తీవ్రంగా ఉంటుంది. అయినా ఏమాత్రం ఆందోళనకు గురికాకుండా లక్ష్యం విధించుకున్నారు. లక్ష్య సాధనలో ఎన్నో ఆటంకాలు, మరెన్నో ఇబ్బందులు ఎదురైనా మొక్కవోని దీక్షతో ముందుకు సాగారు. నిరంతరం పట్టుదలతో చదివి విజేతలుగా నిలిచారు. ప్రభుత్వం సోమవారం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టులకు ఎంపికయ్యారు.

ఎస్జీటీలో అరుణ్‌కుమార్ జిల్లా టాపర్


మోటపోతుల అరుణ్‌కుమార్

ములుగు రూరల్: డీఎస్సీ ఫలితాలలో ములుగు జిల్లా అబ్బాపూర్ గ్రామానికి చెందిన మోటపోతుల అరుణ్‌కుమార్ జిల్లాలో ప్రథమ స్థానం సాధించాడు. తెలుగు సెంకడరీ గ్రేడ్ టీచర్ పోస్టుల విభాగంలో 81.63శాతం మార్కులు సాధించి డీఎస్సీ జనరల్ ర్యాంకు లిస్టులో ప్రథమ స్థానంలో నిలిచారు. అబ్బాపూర్ గ్రామానికి చెందిన మోటపోతుల రాణి –ఆనంద్‌గౌడ్ దంపతుల కుమారుడు అరుణ్‌కుమార్. కాగా, తండ్రి మృతి చెందిన 12వ రోజు డీఎస్సీకి హాజరైన అరుణ్‌కుమార్ మొక్కవోని దీక్షతో పరీక్ష రాసి ర్యాంకు సాధించాడు. దీనిపై గ్రామస్తులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అరుణ్‌కుమార్‌ను అభినందించారు.

డీఎస్సీ ఫలితాల్లో నరేశ్ ప్రతిభ..


నరేశ్

బయ్యారం: డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ (సోషల్) విభాగంలో మండలంలోని కస్తూరినగర్ గ్రామానికి చెందిన మాలోత్ నరేశ్ మొదటిస్థానం సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన నరేశ్.. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని నిజాం కళాశాలలో డిగ్రీ, తొర్రూరు డీఆర్ఎస్ కళాశాలలో బీఈడీ, భద్రాచలంలో డీఈడీ విద్యనభ్యసించాడు. అదేవిధంగా ఎస్జీటీ విభాగంలో ఎస్టీ కేటగిరీలో నరేశ్ మొదటిస్థానం సాధించాడు. స్కూల్‌అసిస్టెంట్, ఎస్జీటీ విభాగాల్లో మొదటిస్థానం సాధించిన నరేశ్‌ను గ్రామస్తులు అభినందించారు.

తొర్రూరు వాసికి 3వ ర్యాంకు


దొంతోజు గీత

తొర్రూరు రూరల్: తొర్రూరు మండలంలోని చెర్లపాలెం గ్రామానికి చెందిన దొంతోజు గీత డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు విభాగంలో జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. దీంతో పాటు భాషా పండితుల విభాగంలో జిల్లా స్థాయిలో 4వ ర్యాంకు సాధించింది. ప్రస్తుతం ఆమె మహబూబాబాద్‌లోని బీసీ గురుకులంలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. అలాగే, మండలంలోని ఫత్తేపురం గ్రామానికి చెందిన వల్లపు యాకయ్య స్కూల్ అసిస్టెంట్ బయాలజీ విభాగంలో జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు సాధించాడు.

కష్టానికి ఫలితం దక్కింది..



నా చిన్న తనంలో తండ్రి చనిపోయారు. మేము మత్స్యకారులం. చాపలు పట్టుకుంటూ, ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. డిగ్రీ, బీఈడీ పూర్తి కాగానే విద్యావలంటరీగా పని చేశా. ఆ పోస్టు కూడా రద్దు కావడంతో ఎలాగైనా ప్రభుత్వం ఉద్యోగం సాధించాలని దృఢ లక్ష్యంతో మూడు సంవత్సరాలు కష్టపడి చదివా. 2024లో నిర్వహించిన డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో తెలుగులో ఫస్ట్ ర్యాంకు సాధించా. –మహబూబాబాద్ అర్బన్

– బండారి నరేశ్, నర్సింహులగూడెం, నెల్లికుదురు మండలం

నాకు నాన్న ఆదర్శం..



నాన్న తాపీ మేస్త్రీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నేను ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని డిగ్రీ, బీఈడీ పూర్తి చేసి ఎలాంటి కోచింగ్ లేకుండా సొంతగా కష్టపడి చదివా. ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తూ డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ఫస్ట్ ర్యాంక్, 72.8 మార్కులు సాధించా. మా నాన్న నాకు ఆదర్శం. –మహబూబాబాద్ అర్బన్

– దేవరకొండ కల్యాణి, బేతోలు, మానుకోట

రోజూ 12 గంటలు చదివా..



మానుకోట జిల్లా గ్రంథాలయంలో ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు చదివా. మాది గీత కార్మిక కుటుంబం. నాకు పెళ్లి అయ్యింది. పాప, బాబు ఉన్నారు. మా కుటుంబ పోషణ మా నాన్నగారే చూసుకునే వారు. 7 సంవత్సరాల నుంచి సొంతగా ప్రిపరేషన్ అయి ఉద్యోగం సాధించా. కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థికంగా డబ్బు లేకపోతే ట్రాక్టర్ అమ్మి కుటుంబాన్ని పోషించుకున్నా. డీఎస్సీ ఫలితాల్లో 18వ ర్యాంకు సాధించా. –మహబూబాబాద్ అర్బన్

– ఐలి వీరేందర్, మోద్గులగూడెం, కురవి మండలం

తల్లిదండ్రుల ఆశయం నెరవేర్చా..



నాన్న వడ్రంగి పని చేసేవాడు. చిన్నప్పటి నుంచి నాకు ఒకటే చెప్పేవారు ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తే జీవితంలో ఉన్నతంగా ఉంటామని. తల్లిదండ్రుల కోరిక మేరకు మానుకోటలో గ్రంథాలయంలో రోజూ సన్నద్ధమయ్యా. మా ఇంట్లో నలుగురు ఆడపిల్లలమే. నేను మూడో సంతానం. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతోనే కష్టపడి చదివా. డీఎస్సీ ఫలితాల్లో 31 ర్యాంకు సాధించి తల్లిదండ్రుల ఆశయం నెరవేర్చా. –మహబూబాబాద్ అర్బన్

– తుపాకుల కావ్య, మోద్గులగూడెం

ఫర్జానా.. ప్రతిభ



దుగ్గొండి: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన ఎండీ ఫర్జానా హిందీ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ప్రతిభ కనబరిచి 65.67 మార్కులు సాధించింది. ఆత్మకూరు మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో హిందీ టీచర్‌గా పనిచేస్తున్న ఫర్జానా.. రెండు నెలల క్రితం వెలువరించిన జేఎల్ ఫలితాలలో స్టేట్ 17వ ర్యాంకు సాధించింది. తాజాగా వెలువరించిన డీఎస్సీ ఫలితాలలో హిందీ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ప్రతిభ చాటింది. జేఎల్, స్కూల్ అసిస్టెంట్ రెండు పోస్టులకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని ఫర్జానా తెలిపింది. భర్త జమాలుద్దీన్ ప్రోత్సాహంలో ఉన్నత విద్య అభ్యసించానని పేర్కొంది.

నెల్లికుదురు, ఇనుగుర్తి మండలాల వాసుల విజయకేతనం


నిడిగంటి సునీల్


పాడకండ్ల నవీన్

నెల్లికుదురు: స్కూల్ అసిస్టెంట్ భౌతిక శాస్త్ర విభాగంలో ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామానికి చెందిన నిడిగంటి సునీల్ జిల్లా మొదటి ర్యాంకు సాధించాడు. అలాగే, నెల్లికుదురు మండల కేంద్రానికి చెదిన పాడకండ్ల నవీన్ స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ విభాగంలో జిల్లాస్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. రాజులకొత్తపల్లి గ్రామానికి చెందిన చిలుముల ప్రవీణ్ స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో (ఎస్జీటీ)లో 6వ రాంకు, అదే గ్రామానికి చెందిన గొడుగు అరుంధతి 7వ ర్యాంకు, ఆలేరుకు చెందిన మహిమూద్ రిజ్వాన ఎస్జీటీలో ర్యాంకు సాధించింది. అలాగే, మండలంలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన బండారి నరేశ్ స్కూల్ అసిస్టెంట్ తెలుగు విభాగంలో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించారు.

ఎస్జీటీలో సౌజన్యకు ములుగు జిల్లాలో 54వ ర్యాంకు


దుర్గం సౌజన్య

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రొయ్యూర్‌కు గ్రామానికి చెందిన దుర్గం సౌజన్య ఎస్జీటీ విభాగంలో ములుగు జిల్లాలో 54వ ర్యాంకు సాధించింది. సౌజన్య తండ్రి సమ్మయ్య చిన్నప్పుడే మృతి చెందగా తల్లి అంకమ్మ అన్ని తానై విద్యాబుద్ధులు చెప్పించింది. సౌజన్య ఒకటి నుంచి 4వ తరగతి వరకు ములుగు ప్రైవేటు పాఠశాలలో, 5నుంచి 10వ తరగతి వరకు జఫర్‌గఢ్‌లోని గురుకుల పాఠశాలలో, ఇంటర్ పర్వతగిరిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో పూర్తి చేసింది. కాజీపేట ఫాతిమా కళాశాలలో డీఎడ్ పూర్తి చేసింది.

పట్టుదలతో చదివి..


మూటిక ప్రవళిక

నల్లబెల్లి: నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన మూటిక రాజు రెండో కూతురు ప్రవళిక డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీ విభాగంలో జిల్లాలో రెండో ర్యాంకు సాంధించింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తన ఆకాంక్షకు అనుగుణంగా పట్టుదలతో చదివింది. డీఎస్సీ పరీక్షకు హాజరై విజయం సాధించింది. కాగా, ప్రవళికను కుటుంబీకులు, గ్రామస్తులు అభినందించారు.

డిస్ట్రిక్ట్ డబుల్ ఫస్ట్ ర్యాంకులు


గోపగోని సంధ్య

దేవరుప్పుల : మండల విద్యావనరుల కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల బోధకురాలు(ఐఈఆర్‌పీ)గా విధులు నిర్వర్తిస్తున్న గోపగోని సంధ్య డీఎస్సీ ఫలితాల్లో రెండు విభాగాల్లో జిల్లా మొదటి ర్యాంకులు సాధించింది. నర్మెట మండల కేంద్రానికి చెందిన సంధ్య ఎస్జీటీ, ఎస్ఏ(స్పెషల్ ఎడ్యుకేషన్) విభాగాల్లో ర్యాంకులు సాధించడంపై ఎంఈఓ కళావతి, ఎమ్మార్సీ సిబ్బంది రవీంద్ రెడ్డి, నర్సింహులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మహేశ్‌కు ర్యాంకుల పంట..



చిట్యాల: మండలంలోని గిద్దెముత్తారం గ్రామానికి చెందిన మామిడి మహేశ్ డీఎస్సీ ఫలితాలలో మూడు వేర్వేరు విభాగాలలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొదటి, మూడు, ఐదో ర్యాంకులు సాధించాడు. లాంగ్వేజ్ పండిట్ విభాగంలో జిల్లా మొదటి ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ తెలుగు విభాగంలో మూడో ర్యాంకు, సోషల్ విభాగంలో ఐదో ర్యాంకు సాధించాడు. కాగా, మహేశ్ ప్రస్తుతం మొగుళ్లపల్లి ఎంజేపీలో టీజీటీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు.

నేనేం పాపం చేశాను దేవుడా..

- కట్టుకున్న బంధం...కన్నబంధం ఒకేరోజు కానరానిలోకాలకు..
- పశువులను తోలుకెళ్తుండగా ఢీకొన్న పాఠశాల బస్సు
- అన్నదమ్ములను వెంటాడిన రోడ్డుప్రమాదాలు
- గౌరారంలో నెలకొన్న విషాదం


భర్త మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య సరిత


రామక్రిష్ణ, ఐలయ్య(ఫైల్)

బయ్యారం: నేనేం పాపం చేశాను దేవుడా .. నాకెందుకు విధించావు ఈ శిక్ష.. నీనెవరిని కడసారి చూసుకోవాలి.. అయ్యా నీతోనే నా దేవుడి(భర్త)ని తీసుకెళ్లావా అంటూ' కన్న తండ్రిని.. కట్టుకున్న భర్తను గంటల వ్యవధిలోనే కోల్పోయిన ఓ మహిళ విలపిస్తున్న తీరు పలువురి హృదయాలను కలిచివేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గౌరారం గ్రామానికి చెందిన సింగరబోయిన రామక్రిష్ణ(45) మామ(భార్య సరిత తండ్రి) తొడుసు ఐలయ్య(70) మహబూబాబాద్ మండలం మాధాపురంలో అనారోగ్యంతో మృతి చెందాడు. మామ అంత్యక్రియలకు వెళ్లాలని సోమవారం ఉదయం రామక్రిష్ణ తన పశువులను బీడులోకి తోలుకెళ్తున్నాడు. ఈక్రమంలో మహబూబాబాద్ మండలం జమాండ్లపల్లి గ్రామంలోని విద్యాభారతి పాఠశాల బస్సు బాలాజీపేట నుంచి వినోభానగర్‌కు విద్యార్థులను ఎక్కించుకునేందుకు వెళ్తూ రామక్రిష్ణను ఢీకొట్టింది. ఆయన పైనుంచి బస్సు వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కొన ఊపిరితో ఉన్న రామక్రిష్ణను చికిత్స నిమిత్తం మహబూబాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు.

రామక్రిష్ణ కుటుంబాన్ని వెంటాడుతున్న ప్రమాదాలు..


గౌరారం గ్రామానికి చెందిన సింగరబోయిన తిరుపతయ్యకు ముగ్గురు కుమారులు. వీరిలో చిన్నకుమారుడు కుమారస్వామి... రామక్రిష్ణ మృతికి కారణమైన విద్యాభారతి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఏడు సంవత్సరాల క్రితం జమాండ్లపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఏడాది క్రితం రామక్రిష్ణ తండ్రి తిరుపతయ్య గుండెపోటుతో మృతి చెందగా.. ప్రస్తుతం రామక్రిష్ణ మృతి చెందడంతో ఆ కుటుంబానికి కోలుకోలేని దెబ్బగా మారింది. ఇద్దరు కొడుకులు రోడ్డు ప్రమాదంలోనే చనిపోవటంతో రామక్రిష్ణ తల్లి వెంకటమ్మ విలపించిన తీరు అందరిని కంటతడి పెట్టించింది.

విషాదఛాయలు..

గ్రామంలో అందరితో కలుపుకోలుగా ఉండే రామక్రిష్ణ మృతితో గౌరారంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన మరణవార్త తెలుసుకున్న గ్రామస్తులు అధికసంఖ్యలో మహబూబాబాద్‌లోని ఆస్పత్రికి వెళ్లి కడసారి చూసుకున్నారు. మరో వైపు మృతుడి భార్య సరిత తండ్రి, భర్తల మరణంతో విలపిస్తున్న తీరుకు ప్రతి ఒక్కరూ కంటతడిపెట్టుకున్నారు. రామకృష్ణకు భార్యతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు. ఈమేరకు భార్య సరిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెమీస్‌లో మహబూబ్‌నగర్, నల్లగొండ జట్లు

- కొనసాగుతున్న అంతర్‌జిల్లాల క్రికెట్ పోటీలు


సెమీస్‌కు చేరుకున్న మహబూబ్‌నగర్ జట్టుతో క్రికెట్ సంఘం బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ కేంద్రంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి కొనసాగుతున్న అండర్–19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు సోమవారం పూల్ 'ఏ' నుంచి సెమీస్‌కు చేరుకున్నాయి. కోమటిపల్లి క్రీడా మైదానంలో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వరంగల్ జట్టు నల్లగొండ స్పిన్ బౌలింగ్ ధాటికి నిర్ణీత 50 ఓవర్లకు గానూ కేవలం 16.5 ఓవర్లను మాత్రమే ఎదుర్కొని 52 పరుగుల వద్ద అన్ని వికెట్లను కోల్పోయి చతికిలబడింది. అనంతరం బ్యాటింగ్ బరిలోకి దిగిన నల్లగొండ 9 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 53 పరుగుల లక్ష్యాన్ని ఛేధించి విజయం సాధించింది. 3 వికెట్ల తేడాతో నల్లగొండ సెమీ ఫైనల్‌కు చేరుకుంది. మొగిలిచర్ల గ్రౌండ్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లకు గానూ 3 వికెట్ల నష్టానికి 217 భారీ పరుగుల చేసింది. అనంతరం బరిలోకి దిగిన మెదక్ జట్టు 32.1 ఓవర్లు ఎదుర్కొని 127 పరుగుల వద్ద అన్ని వికెట్లను కోల్పోయి ఓటమి ని చవిచూసింది. మహబూబ్‌నగర్ 90 పరుగుల భారీ ఆధిక్యంతో సెమీఫైనల్‌కు చేరుకుంది.

ఓఆర్ఆర్‌పై కారు బోల్తా..

- మహదేవపూర్ మాజీ వైస్ ఎంపీపీ దుర్మరణం


పుష్పలత(ఫైల్)

కాళేశ్వరం: హైదరాబాద్ ఓఆర్ఆర్‌పై సోమవారం కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో మహదేవపూర్ మాజీ వైస్ ఎంపీపీ బండం పుష్పలత(50) దుర్మరణం చెందారు. పుష్పలత కుమారుడు వి దేశాలకు వెళ్తుండగా ఎయిర్ పోర్టుకు వీడ్కోలు పలికేందుకు వెళ్తున్న క్ర మంలో కారుబోల్తా పడి పుష్పలత మృతి చెందగా, ఆమె మనవరాలు పరిస్థితి విషమంగా ఉండడంతో ఆస్పత్రికి తరలించారు.

సీబీసీ.. రాష్ట్రంలోనే అతి పెద్ద చర్చి

నూతన హంగులతో నేడు ప్రారంభం

- 131 ఏళ్ల చరిత్ర గల క్రిస్టియన్ కాలనీ చర్చి
- రూ.12 కోట్లతో చేపట్టిన నూతన పనులు పూర్తి


ప్రారంభానికి ముస్తాబవుతున్న చర్చి


ఒకేసారి 5 వేల మంది కూర్చుని ప్రార్థనలు చేసేలా నిర్మించిన చర్చి లోపల భాగం

కాశిబుగ్గ : వరంగల్ క్రిస్టియన్‌కాలనీలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి.. 131 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర గల క్రైస్తవుల దివ్యక్షేత్రం. రాష్ట్రంలోనే అతిపెద్దదైన ఈ చర్చి నూతన హంగులు సంతరించుకుని నేడు మంగళవారం ప్రారంభం కానుంది. 8 ఎకరాల సువిశాల స్థలంలో లక్షా 75 వేల చదరపు అడుగుల వైశాల్యంలో విస్తరించి ఉంది. ఈ చర్చిని 60 ఫీట్ల ఎత్తులో సింగిల్ రూఫ్ ఆర్‌సీసీ స్ట్రక్చర్‌తో జీ+1లో నిర్మించేందుకు 2014లో 5వేల మంది సంఘస్తుల విరాళాలు, రూ.12 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించారు. ఇటీవల నిర్మాణ పూర్తి చేసుకున్న ఈ చర్చిని అంగరంగ వైభవంగా ప్రారంభించనున్నట్లు చర్చి అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు పీఆర్ సాల్మన్, కొల్లూరి రాజ్‌కుమార్, కవిరాజ్ టోని తెలిపారు.

చరిత్ర..

తెలంగాణలో చారిత్రక నేపథ్యం కలిగిన చర్చిలలో వరంగల్ క్రిస్టియన్ కాలనీ సెంటినరీ బాప్టిస్టు చర్చి ఒకటి. దేశ స్వాతంత్ర్యానికి పూర్వం 1893వ సంవత్సరం అక్టోబర్ 1న వరంగల్ మట్టెవాడ ప్రాంతంలో ఈ చర్చిని తొలిసారిగా ప్రారంభించారు. అనంతరం లక్ష్మీపురం ప్రాంతంలో వరంగల్ వ్యవసాయ మార్కెట్ నిర్మించడానికి అప్పటి నిజాం ప్రభుత్వం నిర్ణయం తీసుకుని అక్కడ నివాసం ఉంటున్న క్రైస్తవులకు ప్రస్తుత క్రిస్టియన్‌కాలనీలో 86 ఎకరాల స్థలం కేటాయించి కాలనీ ఏర్పాటు చేశారు. ఆ సమయంలో చర్చి లేకపోవడంతో వారంతా మామిడి చెట్ల కింద ప్రార్థనలు చేసేవారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తి చేసుకున్న చర్చి కింద ఓ చిన్న చర్చిని నిర్మించుకున్నారు. అనంతరం 1946లో రెవరెండ్ గంధం జేమ్స్ ఆధ్వర్యంలో కె. మాణిక్యం, కెఎం. సాల్మన్, ఎం. సంపోను, జె జోక్స్ హెన్రీ, యాకోబ్, నెల్సన్, ప్రకాశం, కొర్నేలు, ముత్తయ్య, క్రైస్తవ కుటుంబాలు, దాతల సాయంతో 8 ఎకరాల స్థలంలో ఆ చర్చి పక్కన సీబీసీ పెద్ద చర్చి, సెంటినరీ బిల్డింగ్, పాస్టర్ల నివాసాల నిర్మాణ పనులు ప్రారంభించి 1956లో పూర్తి చేశారు. కాలక్రమేణా సంఘస్తులు పెరగడం, చర్చి మహిమతో పెద్ద ఎత్తున దేశ, విదేశాల నుంచి విశ్వాసులు వస్తుండడంతో 2014 అక్టోబర్ 1న అప్పటి పెద్ద పాస్టర్ గంధం జోషి జేమ్స్ పర్యవేక్షణలో చర్చి కమిటీ అధ్యక్షుడు కొల్లూరి రాజ్‌కుమార్, కార్యదర్శి పోలెపాక జాయ్ మనోజ్‌కుమార్, కోశాధికారి టి. బెంజమెన్ ఆధ్వర్యంలో రూ. 6.40 కోట్ల వ్యయంతో మెగా చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. నిర్మాణ వ్యయం పెరిగి నూతన హంగులతో సంఘస్తులు, దాతల సాయయంతో సుమారు రూ. 12 కోట్లతో రాష్ట్రంలోనే అతిపెద్ద చర్చిగా సీబీసీ నిర్మాణం పూర్తి చేసుకుని నేడు ప్రారంభానికి సిద్ధమైందని కమిటీ సభ్యులు తెలిపారు. దీనిలో ఒకే సారి 5,500 మంది ప్రార్థనలు చేసుకోవచ్చు. చర్చి నిర్మాణానికి అప్పటి తూర్పు ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి కొండా సురేఖ ప్రభుత్వం నుంచి రూ. కోటీ నిధులు కేటాయించగా అందులో రూ. 50 లక్షలు వచ్చాయని తెలిపారు. ఈ చర్చికి అనుబంధంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 150 చర్చిలు కొనసాగుతున్నాయి. ఈ చర్చిని రాష్ట్రంలోని ఎంతో మంది నాయకులు సందర్శించారు. వారిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, జిల్లాకు చెందిన మంత్రులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సతీమణి వైఎస్ విజయమ్మ, ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, బ్రదర్ అనిల్ సందర్శించి ప్రార్థనలు చేశారు. ప్రస్తుతం చర్చి సీనియర్ పాస్టర్ పుల్లా జగ్జీవన్ బాబ్జీ ఆధ్వర్యంలో నిత్యం ప్రార్థనలు జరుగుతున్నాయి.

సీబీసీ ప్రారంభానికి మంత్రి సురేఖ రూ. 5 లక్షల విరాళం

గ్రేటర్ వరంగల్ 18వ డివిజన్ క్రిస్టియన్‌కాలనీలో మంగళవారం ప్రారంభం కానున్న సెంటినరీ బాప్టిస్టు చర్చి(సీబీసీ)కి రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ రూ. 5 లక్షలు విరాళం అందజేశారు. సోమవారం చర్చి ప్రాంగణంలో ఆ నగదును స్థానిక కార్పొరేటర్ వస్కుల బాబు, కాంగ్రెస్ నాయకులు ఆయూబ్, నవీన్‌రాజు.. చర్చి కమిటీ అధ్యక్షులు సాల్మన్, కార్యదర్శి రాజకుమార్, పాస్టర్ జగ్జీవన్‌బాబ్జీలకు అందజేశారు.

గ్రామ కార్యదర్శి ఆత్మహత్యాయత్నం..

- ఎంపీడీఓ డబ్బులు డిమాండ్ చేస్తుందని ఆరోపణ
- పురుగుల మందు డబ్బాతో కార్యాలయానికి వచ్చి నిలదీత


ఘటనను వివరిస్తున్న బాధిత కార్యదర్శి సరిత, భర్త గణేశ్

మరిపెడ రూరల్: ఎంపీడీఓ విధుల పరంగా వే ధించడమే కాగా, డబ్బులు డిమాండ్ చేస్తుందని గ్రా మ కార్యదర్శి పురుగుల మందు డబ్బాతో ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. ఈ ఘటనను భర్త అడ్డుకుని.. ఆ పురుగుల మందు డబ్బాతో కార్యాలయానికి వచ్చి ఎంపీడీఓను నిలదీశాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత కార్యదర్శి బానోత్ సరిత, ఆమె భర్త గణేశ్ కథనం ప్రకారం.. మరిపెడ మండలం గాలివారిగూడెం కార్యదర్శిగా బానోతు సరిత ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తుంది. మూడు నెలల క్రితం మరిపెడ ఎంపీడీఓ విజయ బాధ్యతలు చేపట్టి, గాలివారిగూడెం గ్రామ ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తుంది. ఆమె వచ్చిన కొత్తలో సరిత వద్ద రూ.5 వేల బదలుగా తీసుకుని ఇప్పటి వరకు తిరిగి ఇవ్వలేదు. ఇటీవల గాలివారిగూడెంలో పైపుల మరమ్మతులకు ఖర్చుల నిమిత్తం రూ.23 వేలు ఎంబీ రికార్డు చేయించారు. ఇందులో రూ.6 వేల మిగలగా రూ. 4 వేల ఇవ్వాలని, అదే విధంగా విధులు నిర్వహించ డం లేదని, ఈరోజు కూడా జీపీ విధులకు హాజరు కాలేదని ఎంపీడీఓ ఫోన్‌లో కార్యదర్శి సరితను వేధించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సరిత ఇంట్లో ఉన్న పురుగుల మందు డబ్బా సీల్ తీసి తాగే ప్రయత్నం చేసింది. గమనించిన భర్త గణేశ్ అడ్డుకొని పురుగుల మందు డబ్బాను తీసుకొని మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి ఎంపీడీఓ విజయను, అక్కడున్న ఎంపీఓలను నిలదీశారు. 'మీ వేధింపులతో నా భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని గణేశ్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటనపై ఎంపీడీఓ విజయను వివరణ కోరగా శానిటేషన్ పనుల్లో భాగంగా కార్యదర్శులు గ్రూప్‌లో ఫొటోలు అప్ లో డ్ చేయాల్సి ఉండగా కార్యదర్శి సరిత చేయకపోవడంతో జీపీ విధులకు హాజరు కాలేదా అని అడిగా నని తెలిపారు. గతంలో ఆమె తనకు రూ.5 వేలు ఇ వ్వ లేదని, ఇచ్చిన ఆ పర్సు వేరే ఉందని తెలి పారు. కార్యదర్శి ఆరోపించినట్లు రూ.4వేలు కూడా అడగలేదన్నారు. ఆ డబ్బులతో ఫాగింగ్ చేయాలని చెప్పానన్నారు.ఆమె ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.